చరమదశలో
ఆ దంపతుల
కోర్కెను
సమాజం
ఎలా అర్థం చేసుకుంది?

# ఆద్యంతఅయోగం

కాండ్రేగుల
శ్రీనివాసరావు
కథ

''తాతయ్యా... తాతయ్యా... నానమ్మ వచ్చేస్తుంది. నానమ్మ వచ్చేస్తుంది''

ఆరుబయట వాలుకుర్చీలో కునికిపాట్లు పడుతున్న అనంతరామయ్యగారు. బుజ్జిగాడి గావుకేకలకి ఉలిక్కిపడి లేచారు.

ఆయనవైపు చూస్తూ, నవ్విన చిన్న కోడలి వంకరినవ్వు, అతని గుండెల్లో శరంలా దూసుకుపోయింది.

అవమాన భారంతో అతని కళ్లు ఆర్ద్రమయ్యాయి.

ఆ కన్నీటిని కళ్లలోనే అదిమి పెట్టడానికి ఆయన శతవిధాల ప్రయత్నిస్తున్నారు. కానీ అది సాధ్యం అయ్యేటట్లు లేదు.

అందరూ తనెందుకిలా వేధిస్తున్నారు?

తనేం తప్పు చేశాడు?


భార్యతో ఏకాంతంగా, మనఃపూర్వకంగా మాట్లాడుకోవడం తప్పా? ''నాన్నగారెక్కడ?'' పెద్దకొడుకు గొంతు ఖంగుమనడంతో, అటువైపు తలతిప్పారాయన.

''ఆరుబయట కూర్చుని, పెళ్లాం గురించి ఎదురుచూస్తున్నట్లుంది'' కోడలు సమాధానంలోని హేళన వ్యంగ్యత ఆయన గ్రహించలేదు.

''ఎదురుచూసింది చాలుగానీ, ఇంట్లోకి వెళ్లమను. ఆయన్ని చూసి ఆమె మరీ సిగ్గుతో కుంచించుకుపోతుంది. ఏవిటో ఏళ్లొచ్చినా వెధవబుద్ధులూ వెధవ చేతలూ మాత్రం పోలేదు''

తనకి వినపడాలని పెద్దకొడుకు కాస్త గట్టిగా అంటున్నాడు.

అనంతరామయ్యగారు అన్యమనస్కంగా లేచి కళ్లలో ఉబుకుతున్న కన్నీటిని కండువాతో వత్తుకున్నారు. చేతి కర్ర తీసుకుని భార్యకి ఎదురుపడకుండా దొడ్డిదారి వెంబడి బయటకు



నడిచారు.

అలవాటు పడిన కాళ్ళు లైబ్రరీవైపు దారితీశాయి. ఓ మూలగా కుర్చీ లాక్కుని పుస్తకం ముందేసుకుని కూర్చున్నారాయన. అక్షరాల వెంబడి కళ్ళు పరుగెడుతున్నా అవి మనసుకి హత్తుకోవడం లేదు.

కొడుకుల చిరాకులకి, కోడళ్ల ఈసడింపులకి కారణమైన నాలుగు రోజుల క్రితంనాటి ఆ సంఘటన

ఎంత వద్దనుకున్నా గుర్తొస్తూనే వుంది.

చిత్రవధ చేస్తూనే వుంది.

పెరట్లో రావిచెట్టు కింద అంట్లు తోముతుంది కమలమ్మ.

వాలుకుర్చీలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్న అనంతరామయ్యగారు ఎందుకో అప్రయత్నంగా భార్యవైపు చూశారు.

నెరసిన తల ముఖంమీద పడుతుంటే, సవరించుకోవడం కూడా మర్చిపోయి, పనిలో నిమగ్నమైన భార్యని చూస్తుంటే అతనికి గడిచిన కాలం జ్ఞప్తికి వచ్చింది.

వైవాహిక జీవితం గురించి తను ఎన్ని కలలు కన్నాడు. రాబోయే శ్రీమతి శరత్ నవలలో కథానాయికి ఉన్నంత సుకుమారంగా వుండాలనీ, ఆమెతో అనుభవాల అనుభూతుల్ని పంచుకుంటూ జీవితంలోని రసానందాన్ని ఆస్వాదించాలనీ, ఒకరిలో ఒకరు లీనమైపోవాలనీ, శృంగార కావ్యాలన్నింటినీ తమ జంట నాయకీ నాయకులుగా నిలిచిపోవాలనీ, ఒక్కటేమిటి ఇలా ఎన్నో మరెన్నో కలలు కన్నాడు.

కానీ ఒక్కటంటే ఒక్కటి కూడా ఫలించలేదు.

అందుకు కారణం తను ఇంటికి పెద్దవాడు కావడమే!

చాలీ చాలని సంపాదనతో సతమతమయ్యే మధ్యతరగతి కుటుంబం తమది. ముగ్గురు చెల్లెళ్ళూ, ఇద్దరు తమ్ముళ్ళూ, అమ్మా నాన్నలతో కలిపి మొత్తం తొమ్మండుగురు సభ్యులతో వున్న కుటుంబం. అంతా ఒకే ఒక ఇరుకు గదిలో కాపురం వుండడంతో కోర్కెలు ఏం తీరుతాయి?

భార్యని లాలనగా దగ్గరకు తీసుకున్న క్షణాలుకూడా చాలా అరుదే! ఏ సమయానికి ఎట్నుంచి ఎవరు వచ్చేస్తారోననే భయంతో చేసే పనులు సంతృప్తినేం మిగుల్చుతాయి. ఆఖరు చెల్లికి పెళ్లిచేసి అత్తారింటికి పంపించేసరికి, కూతురు సమర్తాడడం, తమ్ముడ్ని ఓ ఇంటివాడ్ని చేసేసరికి కొడుకు స్కూలు ఫైనల్ పాస్ కావడం, అంతా ఒకటి తరువాత ఒకటి క్రమబద్ధమైపోయింది. జీవితంలో సగభాగం తోబుట్టువుల బాధ్యతలకే ఖర్చు అయిపోయింది. మిగిలింది కొడుకుల కూతుళ్ల గురించి వెచ్చించక తప్పడంలేదు.

ఏవిటో ఒక్కొక్కరి జీవితాలు అంతే కాబోలు? ఏనాడైనా ఏకాంతంగా భార్యాభర్తలిద్దరూ మనఃపూర్వకంగా ముచ్చటించుకున్నది మచ్చుకి మూడు నిమిషాలుకూడా లేదు.

కమల అనుకూలమైనది కాబట్టే సరిపోయింది. ఆమె స్థానంలో మరెవరైనా అయితే ఎంత రాద్ధాంతం చేసుండేవారో?

బాధ్యతల బరువుని తనకొక్కడికే కాకుండా సంతోషంగా సగభాగాన్ని స్వీకరించిన సహనమూర్తి ఆమె.

ప్చ్... తనని కట్టుకుని ఏం సుఖపడింది కనుక?

చెట్టుమీద కాకి అదే పనిగా అరుస్తుండడంవలన అనంతరామయ్యగారి ఆలోచన్లు తెగిపోయాయి.

నులక మంచ మీద తోమిన అంట్లను కాలేస్తోంది కమలమ్మ.

కన్నార్పకుండా ఆమెనే గమనించసాగారాయన.

ఆ ముంగురులను సవరిస్తూ నుదుటను చుంబించాలనీ, ఎదమీద తలనాన్చి సేదతీరాలనీ, ఆమె వడిలో పసిపాప అయి నిదురించాలనీ, ఎన్ని కోర్కెలో? ఎన్నెన్ని ఊహలో? ఊహలు ఊహలుగానే మిగిలిపోతున్నాయి

ఆచరణకి అవకాశం లేదు.

ఆస్వాదనకి ఆస్కారం లేదు.

జీవితం నిస్సారంగా సాగిపోతోంది.

వైవాహిక జీవితం చరమాంక దశకి చేరిపోతోంది.

తీరని కోర్కెలు నిప్పురవ్వల్లా రాజుకుంటూ అనుక్షణం బాధిస్తున్నాయి. కమలమ్మ నుదుటికి పట్టిన చెమటను పైటచెంగుతో హత్తుకుంటూ, భర్తవైపు చూసింది. భర్త కళ్లలో కొట్టొచ్చినట్టు కనిపించే కోర్కెను ఆమె గమనించకపోలేదు. గత పాతికేళ్లుగా ఆ కళ్లు ఆమెకి పరిచితమే!

చిన్నగా నిట్టూర్చి, చిరునవ్వుతో లోపలికి వెళ్లిపోయింది.

ఆమె చిరునవ్వు అనంత రామయ్యగారికి పెళ్లయిన తొలిదినాలని గుర్తు చేసింది. ఆ రోజుల్లో ఆమె పరిష్వంగం కోసం తను తపించిపోతూ అవస్థలు పడుతుంటే ఆమె ఇలాగే చిరునవ్వులు చిందించేది.

పెళ్లిరోజులు తలచుకోగానే అనంతరామయ్యగారికి ఏదో స్ఫురించింది. ఇది మాఘమాసం కదూ! అనుకుంటూ మెల్లగా లేచి వడివడిగా ఇంట్లోకి నడిచారు. క్యాలెండర్ తీసి ఆరోజు తారీఖు చూశారు.

ఆయన అనుమానం నిజమే అయింది.

ఆవ్వాళ వాళ్ల మ్యారేజ్ డే.

అతని గుండె ఆనందంతో ఉప్పొంగిపోయింది.

ఇక క్షణం కూడా ఆలస్యం చేయకుండా చిన్న చేతిసంచి తీసుకుని బజారుకు నడిచారు. జేబులో ఉన్న ఇరవై రూపాయలతో భార్యకి ఇష్టమైన స్వీట్సు, రెండో మూడో పండ్లు, పువ్వులు కొనుక్కొచ్చారు.

ఆయన ఇల్లు చేరేసరికి పదకొండు కావచ్చింది. కోడళ్లు ఇద్దరూ చెట్టుకింద కూర్చుని బాతాఖానీ కొడుతున్నారు. మనుమలు గోలచేస్తూ ఆడుకుంటున్నారు.

''మీ అత్తయ్య ఏదమ్మా?'' చిన్న కోడలిని ఉద్దేశిస్తూ ప్రశ్నించారాయన.


'ఇంట్లో పడుకుంది మావయ్యగారూ!'' అందామె.

అనంతరామయ్యగారు కాళ్లూ చేతులు కడుక్కుని ఇంట్లోకి నడిచారు.

అలసటతో విశ్రమిస్తోన్న కమలమ్మకి చిన్నగా కునుకు పట్టినట్లయింది. మంచమ్మీద నిద్రపోతోంది.

భార్యని లేపడమా వద్దా అన్న సంశయంలో కాసేపు కొట్టుమిట్టాడి తరువాత ఆ అమాయక మొహంవైపు చూస్తూ కూర్చున్నారాయన.

తన భార్య పెద్ద అందమైనదేం కాదు.



కానీ మంచితనం ఇట్లా వుంటుంది అన్నట్లు ప్రశాంత వదనంతో కనిపిస్తూంటుంది.

అందం అంటే చర్మం మీద కనిపించేది, అద్దంలో అగుపించేది మాత్రమే అనుకుంటారు అంతా. కానీ మనిషి లోపల భావాల రూపం ఎంత అందంగా వుంటుందో చెప్పాలంటే అందుకు తన భార్యే నిదర్శనం.

విశాలమైన ఆమె ఫాలభాగంపై ఉదయించే సూర్యబింబంలాంటి ఎర్రని బొట్టుని చూడగానే అతని హృదయం ఆర్ద్రమయింది. ఆమెకి వంట్లో ఎంత బాగులేకపోయినా సరే సౌభాగ్యానికి చిహ్నమైన ఆ కుంకుమ బొట్టుని మాత్రం మరువదు.

కష్టాల కడలిని తనలో దాచుకున్నా బయటకు చెరగని చిరునవ్వుతో ఆప్యాయతల్ని పంచే ఆ ముఖ సౌందర్యాన్ని వృద్ధాప్యం శిథిలం చేసినా ఆనాటి కొంటెతనం కాస్త మిగిలిపోయి ఏ కోణంనుంచో కనిపిస్తున్నట్లే అనిపించింది అతనికి.

అవ్యక్తమైన అనురాగం మనసుని ఆక్రమిస్తుండగా నిదురించే ఆమె నుదిటను ఆర్తితో చుంబిద్దామని ముందుకు వంగారాయన.

''తాతయ్యా! నాయనమ్మని ముద్దుపెట్టుకున్నాడోచ్!'' చప్పట్లు కొడుతూ అరచిన బుజ్జిగాడి గావుకేక ఆ గదిలో ప్రతిధ్వనించింది.

వాడు అరచుకుంటూ వీధిలోకి పరుగెత్తడం, బయట కూర్చున్న కోడళ్లు విసురుగా ఇంట్లోకి రావడం, అత్తగారి మంచంమ్మీద మావగారిని చూడడం, అంతా క్షణకాలంలో జరిగిపోయింది.

''ఏమిటి? ఏమైంది?'' అదే సమయానికి భోజనానికి వచ్చిన పెద్దకొడుకు ఇంట్లోకి నడిచాడు.

''మీ నాన్నగారు ఏదో నిర్వాకం చేశార్లే'' అంది పెద్దకోడలు దెప్పి పొడుపుగా.

''నాన్నా... మరేమో... నాయనమ్మని తాతయ్య ముద్దుపెట్టుకోవడం నేను చూశాను'' అంటూ బుజ్జిగాడు విశ్లేషించి చెప్పడంతో అనంతరామయ్యగారి శిరసు సిగ్గుతో కుంచించుకుపోయింది.

కొడుక్కి కోపం తారాస్థాయికి చేరడం, అలికిడికి కమలమ్మ మేల్కోవడం రెండూ ఒకేసారి జరిగాయి.

''ఛ... ఛ... సిగ్గు ఉండక్కర్లేదూ? ఇంత వయసు వచ్చాక్కూడా అలాంటి బుద్ధులూ అదీ పట్టపగలు, పిల్లలున్న ఇంట్లో ఇలా చేయడం ఏమన్నా బావుందా నాన్నా!''

కొడుకు నిలదీసి అడుగుతుంటే సమాధానం ఏం చెబుతారాయన???

కమలమ్మకి క్రమంగా పరిస్థితి అర్థమవసాగింది.

''అదికాదు బాబూ! ఈవ్వాళ... ఈవ్వాళ మా పెళ్లి...'' ఆయన మాట పూర్తి చేయకముందే కోడళ్లు కిసుక్కున నవ్వారు.

''పెళ్లిరోజా? కోడళ్లూ, మనవులూ ఉన్న ఈ వయసులో పెళ్లిరోజులూ శోభనాలూ అనడానికి సిగ్గుగా లేదూ? ఛ...ఛ రాన్రాను ఇల్లు సానికొంపలా తయారవుతోంది'' విసురుగా బయటకు వెళ్లిపోయాడు కొడుకు.

అనంతరామయ్యగారి కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. మెల్లగా లేచి బయటకు నడిచారు. కోడళ్ల రెండు జతల కళ్లూ ఆయనవైపు చూస్తూ హేళనగా నవ్వుతున్నాయి.

ఆరోజునుంచి ఈ రోజువరకు హేళనలూ అవమానాలూ ఛీత్కార చీదరింపులకి తను గురి అవుతూనే వున్నాడు.

అర్థం చేసుకునేవాళ్లే కరువయ్యారు.

ఆయన సున్నిత మనసు అవమానాన్ని భరించలేకపోతోంది. అనుక్షణం ఆ సంఘటన గుర్తుకు వస్తూ చిత్రవధ చేస్తూనే వుంది.

★ ★ ★

''మాస్టారూ...''

''మాస్టారూ...''

''మాస్టారూ! పుస్తకం ముందేసుకుని కూర్చోవడమేగాని చదువుతున్నట్లు లేదు ఆ పుస్తకాన్ని కాస్త ఇటు ఇస్తారా?'' కుర్రాడెవరో తనని ఉద్దేశిస్తూ అలా అనేసరికి ఉలిక్కిపడి పరిసరాల్ని పరికించాడాయన. తనున్నది లైబ్రరీలో అని గ్రహించడానికి కొన్ని క్షణాలు పట్టింది.

పుస్తకం తీసి కుర్రాడికి అందించారు.

చుట్టూ చీకట్లు ముసురుకుంటున్నాయి.

ఉన్న నలుగురైదుగురుకూడా పుస్తకాలలో లీనమైపోయారు.

అనంతరామయ్యగారు మళ్లీ ఆలోచనల్లోకి వెళ్లిపోయారు.

ఆ తరువాత... పాపం కమలకూడా తన మూలంగా ఎన్ని అవమానాలకి లోనైందో? ఆ ఇబ్బందికర పరిస్థితుల్లో ఇమడలేక కూతురింటికి వెళ్లిపోయింది. వారం తరువాత మళ్లీ ఇదే రావడం... కనీసం పలుకరింపులుకూడా లేకుండా ఆమె అలా వస్తుంటే తను ఇలా వెను దారి వెంబడి వచ్చేయడం...

ఎంతకాలమిలా?

ఎన్నాళ్లీ తమకీ దుస్థితి?

''ఏవండీ...''

కమల కొంతు. అవును అది కమల గొంతే, కానీ ఇక్కడెందుకు వినిపిస్తోంది. తన భ్రమ కాపోతేనూ..

''ఏవండీ మిమ్మల్నే''

అటుచూసి ఆశ్చర్యపోయారు అనంతరామయ్యగారు.

ఎదురుగా కమలమ్మ.

కలకాదు నిజమే అనుకున్నారాయన.

ఆమె తడబుతూ వచ్చి పక్క కుర్చీలో చతికిలబడింది.

''కమలా! ఎలా వున్నావు? అల్లుడూ కూతురూ కులాసేనా?'' పలకరిస్తుంటే గొంతు బొంగురుపోయింది ఆయనకు.

''వాళ్లంతా బాగానే వున్నారు. మీరెలా వున్నారు? ఈ నాల్రోజులు తప్పనిసరై అక్కడున్నానుకానీ నా మనసు అంతా మీ చుట్టూనే

## నడక

''మా అక్క కొడుక్కి ఏడాదే అయినా ఆరు నెలలనుంచి నడుస్తున్నాడు'' అంది లక్ష్మి.

''అయితే ఈపాటికి బాగా అలసిపోయుంటాడు'' అంది కమల.

- పి.వి. మురళీకృష్ణ (హైదరాబాద్)



వుంది. కోడళ్ల ఛీదరింపులకే ఎక్కడ భోజనం మానేస్తారోనని బెంగపడేదాన్ని''

''ఇదిగో... మీరు కాస్త బయటకెళ్లి మాట్లాడుకుంటారా?'' లైబ్రరీ అటెండర్ వచ్చి గదమాంచేడు.

రామేశ్వరం వెళ్లినా శనేశ్వరం తప్పనట్లు చివరికి ఇంట్లో కాదుకదా వీధిలోకూడా తమకు ఏకాంతం దొరకడంలేదు. చిన్నగా నిట్టూర్చారాయన.

''రండి. ఎక్కడికైనా పోయి మాట్లాడుకుందాం'' అంది కమలమ్మ.

ఇద్దరూ బయటకు నడిచారు.

ఒకరి ప్రక్కన ఒకరు నడుస్తూ ఎన్నెన్నో చెప్పుకోవాలనీ మనసు ముడుల్ని విప్పుకోవాలనీ అనుకున్నారు. కానీ ఆటోరిక్షాల హోరున్న, వాహనాల శబ్దాలతో కోలాహలంగా వున్న ఆ అపొంతంలో అది అసాధ్యమని వాళ్లకి తెలుసు.

దగ్గర్లో వున్న పార్క్‌లోకి దారితీసి ఓ పొద ప్రకకన పచ్చికమీద చతికిలబడ్డారు.

చీకట్లు మరికొంచెం ముసురుకుంటున్నాయి.

ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుంటూ ''కమలా నన్ను క్షమించవూ'' అన్నారాయన గాద్గదిక స్వరంతో.

''క్షమించేటంతటి తప్పు మీరేం చేశారని''

చాలు!

ఆ మాత్రం అర్థం చేసుకున్న ఒక్క తోడుంటే జీవితం సార్థకమే!

అతనికి దుఃఖం పొంగిపొర్లింది.

''ఈ ఆరం రోజులూ వీళ్లంతా నన్ను ఎంత హీనంగా చూశారో తెలుసా కమలా? భ్రష్టుడిగా చూస్తూ అనరాని మాటలతో అనుక్షణం నన్ను చిత్రవధ చేశారు. కమలా! చిత్రవధ చేశారు'' అంటూ చిన్నగా రోదించసాగారాయన.

కమలమ్మ కదిలిపోయింది.

''అయ్యో ఏంటండీ మరీ పసిపిల్లాడిలా... ఎవరైనాచూస్తారు... వాళ్లనైజం మనకి తెలిసిందేకదా! ఊరుకోండి'' అతని కన్నీరు తుడుస్తూ ఓదార్చసాగింది.

చిరుగాలికి తలలూపే చిగురాకులు సైతం తమ ఉనికిని మర్చిపోయి ఒకర్ని ఒకరు ఓదార్చుకుంటున్న ఆ వృద్ధ దంపతుల్ని అపురూపంగా చూస్తూ వుండిపోయాయి.

కొన్ని క్షణాలు గడిచేక హృదయభారం తేలిక అవడంతో వాళ్లిద్దరూ తేరుకున్నారు. మాటలు కరువై మౌనంగా కూర్చున్నారు.

ఆమె కాస్త చొరవ తీసుకుంటూ అతని తలని వక్షానికాన్చుకుని చెవిలో మెల్లగా చెప్పసాగింది.

''ఈ శనివారం అందరూ వెంకటేశ్వరుని ఆలయానికి వెళ్తున్నారు. ఇంటికి కాపలాగా మనమే వుంటున్నాం. వాళ్లు సాయంత్రం అయితేగానీ రారు. ఆ రోజు... ఆ రోజు... ఈ కమల మీదేనండీ'' అందామె.

అతనికి చెళ్లున కొరడాతో చరిచినట్లయింది.

''కమలా... నువ్వుకూడా... నన్ను... నన్ను...'' చేత్తో అతని నోరు మూసేసింది కమలమ్మ.

''కోర్కెతో మీరు తపించిపోతుంటే నేనోదో మిమ్మల్ని ఉద్ధరించేద్దామనికాదు. తీరని కోర్కెన్ని తీర్చుకోవాలనీ, మీ సాహచర్యం కావాలనీ మీ సన్నిధిలో గడపాలనీ నాకూ వుంటుందని మీరెందుకనుకోరు?''

ఆ మాటకి ఆయన చకితులయ్యారు.

ఉద్వేగాన్ని ఆపుకోలేక ఒక్కసారిగా ఆమెని పెనవేసుకున్నారు.

''అ చూశారా? ముసల్లోళ్లకి దసరాపండుగా'' దారినపోయేవాళ్లెవరో అంటున్నారు.

''కలికాలం కాకపోతే ఈ వయసులో అదేం

పోయేకాలం'' మరెవరో వంత పాడారు.

షాక్ కొట్టినట్లు భార్యని వదిలేశారు అనంతరామయ్యగారు.

''కొందరికి వయసు మళ్లిన వాళ్లని చూస్తే చులకన. మీరు అవేమీ పట్టించుకోకండి. మనమొచ్చి ఇప్పటికే చాలా టైమైపోయింది. వెళ్దాం అన్నట్లు నేను ముందు వెళ్తాను. మీరు ఆనక నింపాదిగా రండి''

అనడమైతే అన్నదిగానీ అంత త్వరగా అతన్ని విడిచి వెళ్లడానికి కమలమ్మకి మనస్కరించడంలేదు. కానీ వెళ్లక తప్పదుకదా!

ఆమె నిష్క్రమించిన తరువాత అనంతరామయ్యగారు శూన్యంలోకి చూస్తూ పొంతనలేని ఆలోచనలతో అరగంట గడిపి తరువాత ఇంటివైపు బయలుదేరారు.

మొత్తానికి వాళ్లు ఎదురుచూసే సుదినం రానే వచ్చింది.

కొడుకు కోడళ్లు పిల్లలతో ప్రయాణానికి హడావుడి పడుతుంటే అనంతరామయ్యగారు వీధిలోకి వెళ్లిపోయారు.

సద్దుమణిగేక వాళ్లంతా వెళ్లిపోయాక, వంటింట్లో దాచిన మల్లెపూలు తీసి తలలో తురుముకుని చీర మార్చుకుంది కమలమ్మ.

పౌడర్ రాసుకుంటూ ముస్తాబు అవుతుంటే ఆ వయసులో ఆమె ముఖం ఆమెకే ఎబ్బెట్టుగా అనిపించింది.

అంతలో ఇల్లు చేరిన అనంతరామయ్యగారు అలంకరించుకుంటున్న భార్యని చూస్తూ కుర్చీలో చతికిలబడ్డారు.

తను చేయబోయేది వయసుకుతగ్గ పని కాదనే శంక ఆయన మనసులో లేకపోలేదు.

భర్తమొహంలో కదలాడే భావాలను పరిశీలనగా చూస్తోంది కమలమ్మ.

''కోడళ్లు, మనవలూ ఉన్న ఈ వయసులో పెళ్లి రోజులూ శోభనాలు అనడానికి సిగ్గుగా లేదూ''

''ముసలోళ్లకి దసరా పండుగ అంటే ఇదేనేమో?''

''కలికాలం కాకపోతే ఈ వయసులో అదేం పోయేకాలం''

ఒక్కొక్కటీ గుర్తుకొస్తున్నకొలదీ ఆయనలో ఆత్మన్యూనతాభావం మరింత అధికమైపోతోంది. అది స్వతహాగా కలిగింది కాదు. శూలాలులాంటి మాటలు చేత కలిగించబడింది.

''ఎందుకు మీలో మీరే మదనపడతారు. రండి బయట రావిచెట్టుకింద కుర్చీలు వేస్తాను. కడుపుని మనసులు విప్పుకుందాం. నిప్పురవ్వలులాంటి కోర్కెలు శరీరంలో వున్నా కావాల్సినంత ఏకాంతం అందుబాటులో వున్నా మాటలతో గాయపడ్డ మనసుమాత్రం సహకరించనంటోంది. ప్చ్... రండి వెడదాం'' అంటూ ముందుకు కదిలింది కమలమ్మ.

చదివిన పుస్తకంలో ఏ అధ్యాయం ఎక్కడుందో తెలిసిపోయినట్లే తన ఆలోచనలు తెలుసుకుని మాట్లాడుతున్న ఆమె వైపు వెర్రిగా చూస్తూ వుండిపోయారు అనంతరామయ్యగారు.

నివురులోనున్న నిప్పురవ్వల దేహాలు రెండూ బయటకు కదిలాయి.

అవును. అవి వయసు నివురుగప్పిన కోర్కెల నిప్పురవ్వలు.